# గాడి తప్పుతున్న యువత

**-చిన్న చిన్న కారణాలతో గొడవలు,హత్యలు**
**-చిన్న వయస్సులోనే జైలుపాలవుతున్న వైనం**
**-తల్లిదండ్రులు పట్టించుకోకపోతే అంతేసంగతులు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** సినిమాల ప్రభావమో.. చెడు స్నేహాల ప్రభావమో గానీ.. చిన్నవయస్సు నుండే కొందరు యువకులు గాడి తప్పుతున్నారు.చిన్న చిన్న కారణాలకే స్థానికులు,స్నేహితులతో గొడవలు పడుతూ కొట్లాటల కుదిగుతున్నారు. గ్రూపులుగా ఏర్పడి రక్తం కళ్ల చూస్తున్నారు. ఈక్రమంలో రౌడీలు,గూండాలతో పరిచయాలు పెంచుకొని నేరప్రవృత్తి వైపు అడుగులు వేస్తున్నారు. తల్లిదండ్రుల మాటలు పెడచెవిన పెడుతున్నారు. చెడుసాహసాలు చేస్తూ..జల్సాలకు అలవాటు పడి మద్యానికి బానిసలవుతున్నారు. గ్రూపులుగా ఏర్పడి ఆధిపత్యం,పంతం నెగ్గించుకోవడం కోసం హత్యలు చేయడానికి కూడా వెనకడుగు వేయడం లేదు. ఏదో ఒక నేరం చేసి జైలుపాలై...విడుదలైన తర్వాత స్థానికులను బెదిరిస్తూ దందాలు చేయడం పరిపాటిగా మారింది.దీనికి తోడు స్థానిక రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో వారిజీవితాలు నైరాలవైపు చూస్తున్నాయి. తప్పుచేశామన్న భావన వారిలో ఉండటం లేదు. 20ఏళ్ల వయస్సులోనే జైలుకెళ్లి అక్కడ కరుడు గట్టిన నేరస్తులతో పరిచయాలు పెంచుకుని బయటికి వచ్చిన తర్వాత దాదాగిరి, గూండా గిరి చూస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇలా నగరంలో చాలా సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.ముఖ్యంగా బస్తీల్లో.. తల్లిదండ్రులు కూలీపనికి,చిన్న చిన్న వా్యపారాలు చేసుకోవడానికి బయటికి వెళ్తుండగా..పిల్లలు మాత్రం చదువులు మాని నేరగాళ్లతో దోస్తీకట్టి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడి చివరకు జైలుపాలవుతున్నారు. గతేడాది ఖైరతాబాద్‌లో కొంత మంది స్నేహితుల మధ్య జరిగిన గొడవ చినికిచినికిగాలివానై చివరకు హత్యకు దారితీసింది. పూటుగా మద్యం తాగిన పాతికేళ్ల వయస్సు గలయువకులు రూ.10వేల విషయంలో స్నేహితుడితో గొడవపడి చివరకు హత్యచేసి జైలుపాలయ్యారు. అదేవిధంగా గత కొన్నిరోజుల క్రితం బంజారాహిల్స్‌లో జరిగిన ఓ సంఘటనలో ఇంటర్ చదివే నలుగురు విద్యార్థులు రాంగ్‌రూట్‌లో వచ్చి గొడవపడ్డారనే కారణంతో ఓ వ్యక్తిపై దాడిచేసి హత్యచేసి జైలుపాలయ్యారు. అంతేకాకుండా ఇటీవల నగర శివారులో పట్టుమని 20ఏళ్లుకూడా లేని నలుగురు విద్యార్థులు మరో ఇంటర్ విద్యార్థిని వేటకొడవల్లతో నరికి చంపారు. తాజాగా మేడ్చల్ జిల్లాలోనూ నడిరోడ్డుపై రెండు హత్యలు జరిగాయి.

**రౌడీషీట్ తెరుస్తామన్నా భయంలేదు..**

గొడవల్లో తలదూర్చే పోకిరీల పట్ల గతంలో కఠినంగా వ్యవహరించేవారు.దారికి రాకపోతే రౌడీషీటర్ తెరిచేవారు.ఎక్కడ గొడవలు జరిగినా.. శాంతి భద్రతలకు విఘాతం కలిగినా వారినే బాధ్యులుగా చేసి ముందస్తుగా స్టేషన్‌కు తరలించేవారు. అలాంటి వారికి సమాజంలో మర్యాద, గౌరవం ఉండేదికాదు, వారినిపెళ్ళి చేసుకోవడానికి యువతులు కూడా ముందుకు వచ్చేవారు కాదు. గొడవలకు, కొట్లాటలకు దూరంగా ఉండి..ప్రవర్తనలో మార్పు వచ్చిన తర్వాత పోలీసులు రౌడీషీట్ ఎత్తివేసి మంచి వ్యక్తులుగా గుర్తింపు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ఆపరిస్థితి మారింది. పోలీసులు తమపై రౌడీ షీట్ తెరవాలని కొందమంది పోకిరీలు,రౌడీలు కోరుకుంటున్నారని తెలిసి పోలీసులు అవాక్కవుతున్నారు. గొడవలు,కొట్లాటలు హత్యలు అత్యాచారాలకు పాల్పడుతున్న వారిపై రౌడీషీట్ తెరుస్తామన్న వారిలో కొంత కూడా జంకు కనిపించడం లేదని పోలీసులు అంటున్నారు. ఇటీవల కాలంలో కొంత మంది రౌడీషీటర్లలో మంచి వారిని గుర్తించి పోలీసులు రౌడీషీట్ ఎత్తివేయాలని నిర్ణయించింది. అయితే కొతమంది తమని రౌడీషీటర్లుగానే కొనసాగించాలని ఇలాగే మాకు గుర్తింపు ఉందని పోలీసులు ముందు అన్నట్లు తెలుస్తుంది. కావాలంటే ఏదోఒక నేరంచేసి జైలుకు వస్తాంకానీ మామీద రౌడీషీట్ మాత్రం ఎత్తివేయద్దంటున్నారని పోలీసులు తెలుపుతున్నారు. ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల్ని కట్టడిచేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని.. తమ పిల్లలు ఎక్కడ తిరుగుతున్నారు..ఎవరితో తిరుగుతున్నారో గమనించాలని అనుమానం వస్తే మందలించాలని నిపుణులు తెలుపుతున్నారు.

## ఎస్సీ వర్గీకరణను మంద కృష్ణమాదిగ అడ్డుకుంటున్నారు

**-మంత్రి దామోదర రాజనర్సింహను విమర్శించడం సిగ్గు చేటు**



సమావేశంలో మాట్లాడుతున్న మేడి పాపయ్యమాదిగ

**సైఫాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మూడు దశాబ్దాలపాటు లక్షలాది మంది మాదిగలు, ఉపకులాలు పోరాడి సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అడ్డుకుంటున్నారని మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్య వేదిక ఛైర్మన్ మేడి పాపయ్య మాదిగ ఆరోపించారు. వర్గీకరణ ఏర్పాటు విషయంలో ఎంతో కీలక పాత్రను పోషించిన రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహను మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఆయన అసలు మాదిగ కులస్తుడే కాదని కృష్ణమాదిగ ఆరోపించడం సిగ్గుచేటని, ఆయనది ఏ కులం? అని ప్రశ్నించారు. దామోదర ద్వారానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి, అవసరం తీరిన తరువాత విమర్శించడం దారుణమన్నారు. బేడ బుడగ జంగాల హక్కుల దండు వ్యవస్థాపక అధ్యక్షుడు తూర్పాటి హనుమంతు అధ్యక్షతన శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఐక్య వేదిక వైస్-ఛైర్మన్‌లు ఇటుక రాజు మాదిగ, మేరిమాదిగ, జన్ను కనకరాజుమాదిగలతో కలిసి మేడి పాపయ్యమాదిగ మాట్లాడారు. మాల, ఉప కులాల నేతలను వెంటపెట్టుకుని ఆయన తిరుగుతున్నారని, అసలు ఆయన వెంట ఎంత మంది మాదిగలు ఉన్నారని, మాదిగలకు ద్రోహం చేస్తున్నారని ఖబద్దార్ అని హెచ్చరించారు. కుట్రలు, కుతంత్రాలు చేసి బిజెపికి వంత పాడుతున్నారని ధ్వజమెత్తారు. కృష్ణమాదిగకు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. నివేదికపై లేని పోని ఆరోపణలు చేసి సిఎం దగ్గరకు వెళ్లి నెల రోజుల పాటు కమిషన్‌ను పొడిగించారని, మాదిగలకు విద్యా, ఉద్యోగ రంగాలలో అవకాశాలను దూరం చేస్తున్నారని, వర్గీకరణ కోసం అనేక మంది లాఠీచార్జికి గురైనారని, జైలుపాలై కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, యువత ప్రాణాలను అర్పించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి 'మాదిగ అమర వీరుల జ్యోతి యాత్ర'ను చేపడుతున్నామని మేడి పాపయ్యమాదిగ తెలిపారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు సంగీతం రాజలింగం, గద్ద యాదయ్య, పాలడుగు శ్రీనివాసరావు, ఎ.కృష్ణ, సిహెచ్ ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో మహా శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు



శ్రీ మహాదేవ్ మందిరంలో ఏర్పాటు చేసిన వివిధ రూపాలలో శ్రీ పరమేశ్వరుని చిత్రం

**చార్మినార్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పాతనగరంలోని పలు ప్రాంతాలలో ఉన్న శివాలయాలలో శ్రీ మహారాత్రి మహోత్సవాలకు నిర్వాహకులు చురుకుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.శివాలయాలకు రంగులు వేసి అందంగా తీర్చి దిద్దుతున్నారు.ఈ నెల 26వ తేదీన శివరాత్రి జరుగుతున్నందున వేలాది మంది భక్తులు పాతబస్తీలోని శివాలయాలకు పూజలు నిర్వహించటానికి రానున్నందున ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్నిఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి.చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో శ్రీ మహా శివరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని మందిరం కమిటి కన్వీనర్ అజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు 31 వేల రుద్రాక్షలను పంపిణీ చేయనున్నామని ఆయన తెలిపారు.మందిరంలో శివరాత్రి రోజున రుద్రాభిషేకం,మహా హారతి,రాత్రి 8.30 గంటలకు భజన సంధ్య కార్యక్రమాలు జరగనున్నాయి. కాగా పాతబస్తీలోని దూద్‌బౌలి,పురానాపూల్,చేలాపుర,చార్‌కమాన్,తాడ్‌బన్,శివగంగానగర్, కిషన్‌బాగ్,షంషేర్‌గంజ్‌తో పాటు పలు ప్రాంతాలలో ఉన్న శివాలయాలలో శ్రీ శివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.

## గ్రేటర్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం

**-ప్రతిజోన్‌కు రూ.25కోట్లు మంజూరు**
**-మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ**



బంజారాహిల్స్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** గ్రేటర్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అన్నారు. శనివారం సాయంత్రం బంజారాహిల్స్ రోడ్డు నంబర్12 వార్డు నంబర్ 93లో గల మజీద్ ఖైప్ నుండి మదీనా హోటల్ వరకు రూ. 25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించడం జరుగుతుందన్నారు. అందుకు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో మోలిక సదుపాల కల్పన కోసం ప్రతి జోన్ కు రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సిసి రోడ్లు, డ్రెయినేజీ, స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణాలకు, క్రీడా మైదానాలలో వసతులు కల్పనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత పనులను చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు. ఈ నిధులు పనులు పూర్తయిన తర్వాత మరో రూ.25 కోట్లు ప్రతి జోన్ కు కేటాయింపు చేసేందుకు కమిషనర్‌తో నిర్ణయం తీసుకున్నట్లు మేయర్ పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిహెచ్ఎంసి అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు మేయర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిసి ప్రశాంతి ఈఈ విజయకుమార్ పాల్గొన్నారు.

## సిపిఆర్‌పైన ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి

**-టిజి ఎస్‌పిఎఫ్ డిజి డా.అనిల్‌కుమార్**



బుద్ధభవన్‌లో నిర్వహించిన సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీ డా.అనిల్‌కుమార్.

**బేగంపేట ఫిభ్రవరి 22,ప్రభాతవార్త** సీపీఆర్‌పైన ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని టీజీ ఎస్ పి ఎఫ్ డీజీ డా.అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు.శనివారం బుద్ధభవన్‌లోని టీజీఎస్‌పీఎఫ్ హెడ్ క్వార్టర్స్‌లో సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా.అనిల్‌కుమార్ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కల్గి ఉంటే అత్యవసర పరిస్థితులలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చున్నారు.అలాగే విధులలో ఉన్న సిబ్బందికి ఏమైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వారిని విపత్కర పరిస్థితుల నుంచి కాపాడవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ పీ ఎఫ్ కమాండెంట్ యన్.త్రినాథ్,సిఐ సన్యాసీరావు,ఎస్సై కోటేశ్వరరావు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాద్ వార్త

## "అన్నపూర్ణ" కేంద్రాలపై జిహెచ్ఎంసి ఫోకస్

**-కనీస వసతి,భోజన నాణ్యత పరిశీలనకు ప్రత్యేక కమిటీ**
**-ఛీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఇద్దరు అడిషనల్ కమిషనర్లకు బాధ్యతలు**
**-క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని కమిషనర్ ఆదేశం**



లక్డికపూల్‌లోని అన్నపూర్ణకేంద్రం వద్ద భోజనం చేస్తున్న ఛీఫ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్లు పంకజ, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** అన్నపూర్ణ భోజనం (రూ.5)పై జిహెచ్ఎంసి ఫోకస్ పెట్టింది. దీన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలకు పూనుకుంటుంది. అందులో భాగంగా కనీస వసతుల పరిశీలన, భోజన పరిస్థితి పరిశీలించేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఈకమిటీకి జిహెచ్ఎంసి చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి హెడ్‌గా, అడిషనల్ కమీషనర్లు పంకజ (హెల్త్), వేణుగోపాల్ రెడ్డి (అడ్వర్టైజ్మెంట్) సభ్యులుగా నియమించారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కమిటీ శనివారం సెక్రటేరియట్ వెనుక భాగంలో మింట్ కాంపౌండ్ లక్డికాపూల్ వద్ద అన్నపూర్ణ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న కనీస వసతులు భోజన పరిమాణం నాణ్యతను పరిశీలించారు. అనంతరం లక్డికాపూల్ వద్ద గల అన్నపూర్ణ క్యాంటీన్‌లో భోజనం చేసి నాణ్యత బాగుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అన్నపూర్ణ కేంద్రాలు నిరుపేదలకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో కనీస వసతులతో పాటు పౌష్టికాహారం అందించేందుకు జిహెచ్ఎంసి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. క్యాంటీన్ల పరిస్థితిని పరిశీలించి, రెండు ప్రదేశాలలో మరమ్మతులు చేపట్టాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు.

**సామాన్యులకు ఆసరగా..**

గతంలో జీహెచ్ఎంసీ పరిధిలోని 150 డివిజన్లలో 150 అన్నపూర్ణ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం అధికారులు 23 సెంటర్లను ఎత్తివేశారు. ఒక్కో సెంటర్ ద్వారా రోజుకు 300 మందికి చొప్పున 150 కేంద్రాల ద్వారా 45 వేల భోజనాలు అందించాల్సి ఉండగా, ప్రస్తుతం 127 సెంటర్ల ద్వారా దాదాపు రూ.30వేల మందికి మాత్రమే భోజనాలు అందిస్తున్నారు. సగటున రోజుకు ఒక కేంద్రం ద్వారా 250 భోజనాలు అందిస్తుండగా, ఏడాదికి రూ.25 కోట్ల మేర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 10 కోట్ల 88 లక్షల మందికిపైగా భోజనం అందించి దేశంలోనే అతిపెద్ద భోజన పథకంగా నిలిచింది. ఇందుకోసం కేసీఆర్ ప్రభుత్వం రూ. 216.01 కోట్లు వెచ్చించింది. వివిధ చిన్నచిన్న వృత్తులవారితోపాటు విద్యార్థులకు, నిరుద్యోగులకు అన్నపూర్ణ పథకం వరప్రసాదంగా నిలిచింది. 15 అన్నపూర్ణ క్యాంటీన్లలో సిట్టింగ్ ఏర్పాటు చేసి ప్రైవేట్ భోజనశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అన్నపూర్ణ కేంద్రాలను తీర్చిదిద్దారు.జీహెచ్ఎంసీ పరిధిలోని18పెద్ద ప్రభుత్వ దవాఖానలు ఉండగా, 17 దవాఖానల్లో రూ.5లకే భోజనం అందిస్తుంది.

## బండ్లగూడ కార్పొరేషన్‌ను సందర్శించిన బీహార్ ప్రతినిధి బృందం

**- స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల పరిశీలన - అన్ని అంశాలను వివరించిన కమిషనర్ శరత్‌చంద్ర**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో స్వయం సహాయక సంఘాల విధి విధానాలను తెలుసుకుంటున్న బిహార్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ సంస్థ ప్రతినిధులు

**నార్సింగి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను శనివారం బీహార్‌కు చెందిన రూరల్ లైవ్లీహుడ్ మిషన్ ప్రతినిధుల బృందం సందర్శించారు. ఈ కార్పోరేషన్‌లో స్వయం సహాయ సంఘాల విధి విధానాలు, పనితీరు, స్థానిక వస్తువుల తయారీ, నాణ్యత, వినియోగదారుల ఆసక్తి వంటి విషయాలపై లైవ్లీహుడ్ మిషన్ సంస్థ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్ మిశ్రా బృందం ఆరా తీసింది. వీరికి కమీషనర్ శరత్‌చంద్ర, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లీశ్వరిలు పవర్‌పాయింట్ ప్రదర్శనతో కార్పోరేషన్‌లోని మహిళా సంఘాల విధి విధానాలు, స్వయం ఉపాధి, ఇంట్లో తయారు చేసిన వస్తువులు, పరికరాలు, తిను బండారాలను ఎలా అమ్ముతున్నారు? మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన పరికరాలు ఇస్తూ, ఎలా ఆదాయంను సమకూర్చుకుంటున్నారు? వంటి విషయాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. మహిళలు ఇళ్ల వద్దనే ఉంటూ ఇంట్లోనే తయారు చేసిన వస్తువులు, తిను బండారాలను విక్రయించి ఆర్థికంగా బలపడుతున్న తీరుకు బీహార్ ప్రతినిధులు ముగ్ధులయ్యారు. ఈ విధానం పట్ల బీహార్ ప్రతినిధుల బృందం చాలా ఆసక్తి కనబరిచారు. పూర్తి వివరాలు సేకరించుకొని మా రాష్ట్రంలో కూడా అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మిషన్ కోఆర్డినేటరులన ప్రసన్న, పద్మ, రేష్మీ, శ్రీలత, ఉమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**ఆదాయంపై సమీక్ష నిర్వహించిన కమీషనర్ శరత్‌చంద్ర**

బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలో ఆదాయ వనరులపై కమీషనర్ శరత్‌చంద్ర అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం సాయంత్రం కార్పోరేషన్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ట్రేడ్ లైసెన్సుల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్‌టైజ్మెంట్ పన్నుల వసూళ్లు, స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా సిటిజన్ ఫీడ్‌బ్యాక్, ఆస్థి పన్ను వసూళ్లు, ఆన్-అసైండ్, అండర్ అసైండ్, నూతన సంఘాల ఏర్పాటు, ఇందిరా మహిళ శక్తి పతకం టార్గెట్లపై ఆరా తీశారు. ఉద్యోగులు, సిబ్బంది అంతా సమిష్టిగా పని చేయాలని, కార్పోరేషన్ ఆదాయంను గణనీయంగా పెంచేందుకు కష్టపడాలని సూచించారు. ఆస్థి పన్ను వసూళ్ల మరింత వేగంగా చేయాలని, మార్చి 20.వ,తేదీ వరకు లక్ష్యాన్ని చేరుకునేలా పని చేయాలని ఆదేశించారు. అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేసేందుకు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మంజులత, ఆర్ఓ కె.శివకుమార్, వివిధ సెక్షన్ల అధికారులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, రీసోర్స్ పర్సన్స్, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారులు చట్టపరమైన నిబంధనలను పాటించాలి

**-అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) విశ్వ ప్రసాద్**




**పంజగుట్ట, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నప్పుడు అన్ని చట్టపరమైన నిబంధనలను పాటించాలని అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) పి. విశ్వ ప్రసాద్ కోరారు. శనివారం.. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు బ్లాక్ ఫిల్మ్‌లు, సైరన్‌లు, మ్యూజికల్ , మల్టీటోన్ హారన్‌లు, మోడిఫైడ్ సైలెన్సర్‌లు, నంబర్ ప్లేట్‌లు , వాహన మార్పులు , మార్పులతో వ్యవహరించే వ్యాపారుల కోసం ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) పి. విశ్వ ప్రసాద్, ఐపీఎస్ పాల్గొన్నారు, వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నప్పుడు అన్ని చట్టపరమైన నిబంధనలను పాటించాలని కఠినమైన సూచనలు జారీ చేశారు . నిబంధనలను పాటించకపోవడం వల్ల కలిగే చిక్కులను నొక్కి చెప్పారు. వివిధ చేయవలసినవి , చేయకూడని వాటిని ఆయన వివరించారు మరియు ఈ విషయంలో వారి సహకారాన్ని కోరారు. తమను సంప్రదించే కస్టమర్లకు అవగాహన కల్పించాలని , చేసిన పని రికార్డులను నిర్వహించాలని ఆయన వారిని కోరారు. అటువంటి ఉల్లంఘనలు గమనించినట్లయితే, సంబంధిత వ్యాపారులను ఉల్లంఘన/చట్టవిరుద్ధతకు ప్రేరేపించేవారుగా పరిగణిస్తారని ఆయన అన్నారు. చివరికి, ఈ నియమాలను పాటించడం వల్ల రోడ్డు భద్రత పెరుగుతుందని, ప్రమాదాలను తగ్గిస్తుందని, దుర్బలమైన రహదారి వినియోగదారులను రక్షిస్తుందని మరియు బాధ్యత మరియు జవాబుదారీతనం యొక్క సంస్కృతినిప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**బ్లాక్ ఫిల్మ్‌లు:** సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్ 100 ప్రకారం, వాహన తయారీదారులు ముందు మరియు వెనుక విండ్‌స్క్రీన్‌లకు కనీసం 70 విజువల్ లైట్ ట్రాన్స్‌మిషన్‌ను మరియు సైడ్ విండోలకు కనీసం 50 ఉండేలా చూసుకోవాలి. భద్రతా కారణాల దృష్ట్యా బ్లాక్ ఫిల్మ్‌ల వాడకం ఖచ్చితంగా నిషేధించబడింది, ఎందుకంటే అవి దృశ్యమానతను అడ్డుకుంటాయి మరియు నేరస్థులకు సహాయపడటమే కాకుండా ప్రమాద ప్రమాదాన్ని పెంచుతాయి.మల్టీటోన్డ్ హార్న్‌లు: మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 52, వాహనం యొక్క అసలు స్పెసిఫికేషన్‌ల నుండి వైదొలిగే ఏవైనా మార్పులను నిషేధిస్తుంది. మల్టీటోన్డ్ హార్న్‌లు లేదా ఏదైనా అనధికార ధ్వని ఉత్పత్తి పరికరాలను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధం.రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు: సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్, 1989లోని రూల్స్ 50 మరియు 51 ప్రకారం, నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఇంగ్లీష్ అక్షరాలు మరియు అరబిక్ సంఖ్యలను ప్రదర్శించాలి.

**వివిధ వాహన వర్గాలకు సూచించిన పరిమాణాలు:**

సవరించిన సైలెన్సర్లు: కేంద్ర మోటారు వాహన నిబంధనలలోని 120వ నియమం ప్రకారం అన్ని మోటారు వాహనాలు ఎగ్జాస్ట్ శబ్దాన్ని తగ్గించే పరికరాలను కలిగి ఉండాలి, శబ్ద కాలుష్య ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో, వ్యాపారులు , మెకానిక్‌లకు మోటారు వాహన చట్టం మరియు పైన పేర్కొన్న అంశాలకు సంబంధించిన నియమాలపై అవగాహన కల్పించారు, దీని తరువాత ప్రశ్నోత్తరాల సెషన్ జరిగింది.ఈ సమావేశంలో బి.కె. రాహుల్ హెగ్డే, ఐపీఎస్, ట్రాఫిక్ఐ డీసీపీ, ట్రాఫిక్ఐ డీసీపీ ఎన్. అశోక్ కుమార్, ట్రాఫిక్ఐ డీసీపీ, అదనపు డీసీఎస్పీ, ఏసీఎస్పీ, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఇన్‌స్పెక్టర్లు , కార్ డెకర్స్, ఆటో మొబైల్ షాపులు, ఆటోమొబైల్ వర్క్‌షాప్‌లు, రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు మరియు మెకానిక్‌ల తయారీదారుల దాదాపు 250 మంది దుకాణ యజమానులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డితోనే ఉద్యోగల భర్తీ సాధ్యం: శ్రీగణేష్



పట్ట భద్రుల సమస్యలు పరిష్కరించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆసిఫాబాద్ నేతలు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితోనే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సాధ్యమని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆసిఫా బాద్ నియోజ కవర్గం ఇన్‌ఛార్జిగా నియమించినందుకు ఆ ప్రాంత పట్ట భద్రులు, కాంగ్రెస్ అభిమానులు శ్రీగణేష్‌ను ఘనంగా సత్కరించి సకాంలో ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ చేసి విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన దృష్టి కి తెచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఎస్‌సిఆర్‌పిఎస్ డైరిని ఆవిష్కరించిన ఎమ్మెల్యే తలసాని



ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం రూపొందించిన డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యావద్ తదితరులు

**అడ్డగుట్ట,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** తెలంగాణ ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని శనివారం మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యావద్ మారేడ్‌పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలు,చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, ప్రభుత్వ అధికారుల ఫోన్ నెంబర్లు ఈ డైరీలో పొందుపర్చడం వల్ల ఎంతో మందికి ఉపయోకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి. ఆర్.పి. ఎస్.రాష్ట్ర అధ్యక్షులు డి.సుదర్శన్,కె.మహేందర్, నియోజకవర్గం నాయకులు ఆర్.అశోక్, త్రిశూల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత

### -డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

### -స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న భట్టివిక్రమార్క, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, సంజయ్, రాజశేఖర్ తదితరులు

**హైదరాబాద్,ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం ఆధికారంలో వచ్చిన తర్వాత క్రీడా రంగం అభివృద్ధిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని చెప్పారు. సచివాలయంలోని తన చాంబర్‌లో స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జేఏటీ) 2025 వార్షిక డైరీని భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడా రంగానికి అధిక నిధులు కేటాయించి క్రీడలకు, క్రీడాకారులను మరింతగా ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. జాతీయ క్రీడలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని చెప్పారు. ఆతిథ్య హక్కులకు బిడ్ వేసే విషయంలో చొరవ తీసుకుంటానని తెలిపారు. క్రీడలు, క్రీడా సంఘాల సమాచారంతో డైరీని రూపొందించిన ఎస్‌జేఏటీని భట్టి విక్రమార్క అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌జేఏటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణా రెడ్డి, శ్రీనివాస్ దాస్, ఉపాధ్యక్షుడు ఎస్‌ఎస్‌బీ సంజయ్, సంయుక్త కార్యదర్శి సిహెచ్ రాజశేఖర్ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## మామిడి మాధవికి ఘన సన్మానం



మామిడి మాధవిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ మహిళా ఇన్ చార్జిగా మామిడి మాధవి నూతనంగా నియమితులు కావడంతో శనివారం కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూరాకుల కృష్ణ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ రాజకీయంగా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. నియోజకవర్గ మహిళా ఇన్ చార్జ్ ద మామిడి మాధవి నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. సన్మానించిన వారిలో నాయకులు వినోద్ సింగ్, నర్సింగ్ గౌడ్, గజిరె కిషన్, రామ్ కుమార్, హమ్మద్, శ్రీకాంత్, గోపాల్, అలీ ప్రేమ్ కిషోర్, శివ లాల్, షకీలా, వనజ లు ఉన్నారు.

## మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి : తేలుకుంట



సిఈఓ మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేస్తున్న సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్‌గుప్త తదితరులు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం 5వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా రోజు విడిచి రోజు మంచినీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ 5వ వార్డుకు చెందిన సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త, బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు సిఈఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## విద్యార్థి దశలోనే సేవాభావం అలవర్చుకోవాలి: హర్ష సాయి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న హర్ష సాయి

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** విద్యార్థి దశలోనే సేవా భావం అలవర్చుకోవాలని యూట్యూబర్ హర్ష సాయి కోరారు. పేదవారికి సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం కలుగుతుందన్నారు. మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ బాలికల కళాశాలలో శనివారం ఫేర్ వెల్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉత్సాహ పూరిత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ వీడుకోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూట్యూబర్ హర్ష సాయి హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు శాస్త్రీయ, జానపద, గిరిజన నృత్యాలతో పాటు పురాతన సినిమా పాటలపై ప్రదర్శనలు చేయడంతో విద్యార్థులు కేరింతలతో అలరించారు. అనంతరం ఒక గీతానికి నృత్య రూపకల్పన చేసి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అంకితం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన హర్ష సాయి వేదికపై కృత్య ప్రదర్శన చేస్తుంటే కళాశాల ప్రాంగణమంతా విద్యార్థుల కేరింతలతో మారుమ్రోగింది. నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హర్ష సాయి, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ పుష్పలీల చేతుల మీదుగా బహుమతులను అందజేసి మాట్లాడారు... ఇక్కడ విద్యనాభ్యసించిన విద్యార్థులు అని రంగాలలో రాణిస్తూ దేశ విదేశాల్లో ఖ్యాతిని గడించడం మా కళాశాల ప్రతిభకు నిదర్శనం అన్నారు. దేశ విదేశాల్లో ఉన్న టువంటి మా కళాశాలలు అన్ని అత్యున్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాయని, నేటి కాలానికి విద్యయే ప్రధానమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెం ట్ సిస్టర్ ప్రశాంతి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆర్టీసిని సొంత సంస్థగా భావించాలి : ఈడి రాజశేఖర్

**అడ్డగుట్ట,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ఆర్టీసి నా సొంత సంస్థగా, ఇల్లుగా భావించుకొని విధులు నిర్వహించి సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆర్టీసి గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ డిపోలో డ్రైవర్,కండక్టర్లకు నిర్వహించిన పవర్ శిక్షణా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పోటీ ప్రపంచంలో ఉద్యోగులు రాణించేందుకు నైపుణ్య శిక్షణలో భాగంగా వృత్తిపరమైన సవాల్లను ఎదుర్కొనేందుకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్ రావ్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీపతి క్రిష్ణ,ఏఈ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### 24న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం : శ్రీ కిషన్

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ కోసం మంద క్రిష్ణ మాదిగ తలపెట్టనున్న లక్ష డప్పులు,వెయ్యి గొంతుల కార్యక్రమ కార్యాచరణపై ఈ నెల 24న సికింద్రాబాద్ కంటోన్మెంట్ డ్రీమ్ ల్యాండ్ గార్డెన్‌లో నిర్వహించి నున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బొర్ర బిక్షపతి మాదిగ, ఉపాధ్యక్షులు ఇటుక శ్రీ కిషన్ మాదిగలు తెలిపారు. శనివారం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీల వర్గీకరణను తక్షణమే సమన్యాయం చేయాలని జస్టిస్ శమీ అత్తర్ కమిటీ రిపోర్ట్ మార్చి 10 వరకు పొడగించిందన్నారు. ఎస్సీలను ఏ,బి,సి,డీలుగా విభజించి అభివృద్ధి చెందని కులాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై ఈ నెల 24న జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయంతం చేసేందుకు ఎమ్మార్పీఎస్ నేతలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గజ్జెల రాజశేఖర్, కొండ్రుపల్లి శివ మాదిగ, రామక్రిష్ణ, రెడ్డిపాక రవి, అజిత్ కళ్యాణ్ పాల్గొన్నారు.

### పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి : కొంతం దీపిక



గ్యాస్ మండిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** మోండా డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న పెండింగ్ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆమె ఆదయ్య నగర్, గ్యాస్ మండి సెకండ్ బజార్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

### పేదల వైద్య సేవలకు సహకారం : పద్మారావు గౌడ్



లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. చిలకలగుడాకు చెందిన బాలామణి, మంజుల వైద్య సహాయానికి రూ.3.50 లక్షల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధుల మంజూరు పత్రాలను (ఎల్.ఓ.సీ) లను పద్మారావు గౌడ్ శనివారం సితాఫలమండీ లోని తమ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ప్రజలు అత్యవసర సందర్భాల్లో సితాఫల మండీ లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నానిపేర్కొన్నారు.బి.ఆర్.ఎస్.నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు బిజెపి అండ

### -రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



బిజెపి కార్యకర్త దోనేటి సత్యంను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** పార్టీ కోసం అంకింత భావంతో పనిచేసే కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. శనివారం బీజేపీ గాంధీనగర్ డివిజన్ యువ నాయకుడు దోనేటీ సత్యం ఇటీవలే అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని జవహర్‌నగర్ లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ సభ్యత్వం, అభివృద్ధి కోసం విశేషకృషి చేశారని డాక్టర్ లక్ష్మణ్ అభినందించారు. సత్యం త్వరగా కోలుకొని ఆయన ఆకాంక్షిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయకుమార్, బీజేపీ సీనియర్ నాయకులు చెర్ల గోపాల్రెడ్డి, పార్టీ సినీయర్ నాయకులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో రోగికి అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం..

**పంజగుట్ట, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త)**

నిమ్స్‌లో సిబ్బందిగా ఉన్న ఒక రోగికి రెండున్నరేళ్ల కిందట ప్రమాదానికి గురై వెన్నుపూస కు గాయమైంది. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్‌లో ఆపరేషన్ చేశారు. న్యూరోసర్జరీ మరియు విరిగిన వెన్నెముకను రాడ్‌లు మరియు స్క్రూలతో కలపడం జరిగింది. అయితే రోగి పక్షవాతంతో వీల్‌చైర్‌కె పరిమితమ్మయ్యడు. ఫిజియోథెరపీతో చికిత్స పొందుతున్న ఎలాంటి ఉపయోగం కలగలేదు. వెన్నుపూస స్టిమ్యులేటర్ నొప్పిని మెరుగుపరుస్తుందని మరియు కండరాల కార్యకలాపాలను మెరుగుపరుస్తుందని మరియు చలనశీలత పునరావాసంలో సహాయపడుతుందని భావించి ఈ శస్త్రచికిత్సకు ప్రొఫెసర్ సుచంద భట్టాచార్జీ, డాక్టర్ రాంనాథ రెడ్డి బృందం ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ స్వప్న డాక్టర్ అవినాష్‌లతో కూడిన అనస్థీషియా బృందం నాయకత్వం వహించి ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసారు. ఈ శస్త్రచికిత్సలో వాడిన పరికరం చాలా ఖరీదైనది అయినప్పటికీ, న్యూరోసర్జరీ విభాగంలో జరుగుతున్న విధానాల జాబితాకు ఇది కొత్త మైలురాయిని తెస్తుంది. వెన్నుపూస ఉద్దీపన ప్రక్రియ క్యాన్సర్ యొక్క దీర్ఘకాలిక తట్టుకోలేని నొప్పి, విఫలమైన శస్త్రచికిత్సలు మరియు మరెన్నో సూచనలకు గొప్ప నొప్పి నివారణ సామర్థ్యాన్ని కల్గిస్తుంది.రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో మొదటి సారి ఇలాంటి అరుదైన మరియు క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసిన వైద్యులను నిమ్స్ సంచాలకులు నగరి బీరప్ప , సీనియర్ వైద్యులు అభినందించారు.

## వీధి వ్యాపారుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలి



వీధి వ్యాపారుల తరపున అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న పవన్‌కుమార్ గౌడ్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** పొట్ట కూటి కోసం వీధి వ్యాపారం చేసుకుంటున్న కుటుంబాల పట్ల అధికారులు మానవతా కోణంలో ఆలోచన చేయాలనీ బీఆర్ఎస్ నాయకుడు, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ అధికారులను కోరారు. గాంధీ హాస్పిటల్ వద్ద ఉన్న చిరు వ్యాపారాలను ఇటీవల ట్రాఫిక్ పోలీసులు తొలగించడం వారందరూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మోర పెట్టు కున్నారు. ఈ విషయంలో వెంటనే వారికీ తగు న్యాయం చేయాలనీ తలసాని సూచన మేరకు నేడు బీఆర్ఎస్ నాయకుల బృందం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం గాంధీ హాస్పిటల్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ విషయాన్ని వెంటనే సికింద్రాబాద్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య దృష్టికి తీసుకువెళ్లిన పిదప అయన వెంటనే స్పందించి టౌన్ వెండింగ్ కమటి సభ్యుల బృందం యూసీడ్, టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్, ఎన్‌పీసీ అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వారు వ్యాపారం చేసుకునేదుకు మాకు ఎలాంటి ఇబ్బంది లేదని ట్రాఫిక్ అధికారులు చేసిన సూచన మేరకు జీహెచ్ఎంసీ అధికారులు టీడబ్ల్యూసీ సమావేశంలో తగు విధంగా ఆదేశాలు జారీ చేస్తామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులు కరుణాకర్, ఎన్‌ఏకే, ఏఈ సారిక, యూసీడీ అధికారి నర్సింహ్మా, జగదీష్‌ల తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

### సమసమాజ స్థాపనకు యువత పాటుపడాలి

### -సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ




శిక్షణా తరగతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**ముషీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** దేశంలో అసమానతలు లేని సమ సమాజ స్థాపన కోసం యువత పాటుపడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. శనివారం ముషీరాబాద్‌లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్టు) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీలలో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) పార్టీ యువ కార్యకర్తల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ దేశంలో విభజించి, పాలించే విధానం, మతపరమైన రాజకీయాలు కొనసాగుతున్నాయని, వాటిని అడ్డుకునేందుకు యువత ముందుకురావాలని అన్నారు. బీజేపీ పాలనలో పేదలు మరింత పేదలు అయ్యారని, శతకోటీశ్వరులు మాత్రం 200 మందికి చేరుకున్నారని విమర్శించారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన బీజేపీ మాటలు నీటిమూటలు అయ్యాయని, దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ పన్నుతున్న విషవలయంలో యువత చిక్కుకోవద్దని, షహీద్, భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని సమసమాజం కోసం పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు అశోక్‌రెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, ఎం.మహేందర్, నగర కమిటీ సభ్యులు జె.కుమారస్వామి, జి.నరేష్, ఎన్.మారన్న, జి.కిరణ్, జావెద్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం

## -హైకోర్టు జడ్జి మాధవీదేవి



ఉమెన్ అండ్ క్లైమేట్ యాక్షన్ సింపోసియంలో పాల్గొన్న హైకోర్టు జడ్జి టి.మాధవీదేవి

**ముషీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర చాలా కీలకమైనదని హైకోర్టు జడ్జి టి.మాధవీదేవి అన్నారు. శనివారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ మరియు రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఉమెన్స్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో నారాయణగూడలో నిర్వహించిన ఉమెన్ అండ్ క్లైమేట్ యాక్షన్ సింపోసియంకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇళ్లల్లో కానీ బయట కానీ మహిళలు ఎక్కువగా కష్టనష్టాలు అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రకృతి పరంగా ఎదురయ్యే విపత్తులను ఎదుర్కొనే సందర్భంలోనే కాకుండా ప్రకృతిని రక్షించే బాధ్యతలు తీసుకొనే గొప్పతనంలో కూడా మహిళలు ముందుంటారని గుర్తు చేశారు. ఆర్‌బివిఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అచ్చుతాదేవి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల మహిళలు, పిల్లలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పల్లెల్లో ఇప్పటికీ కట్టెల పొయ్యి వినియోగం ఉందని, ఆ పొగ వల్ల చాలా మంది మహిళలు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీల లక్ష్మారెడ్డి, దిలీప్‌రెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, హెచ్‌ఎంఐఎస్ సెక్రటరీ ముత్యంరెడ్డి, సీనియర్ అడ్వకేట్ అశోక్‌రెడ్డి, పంకజ్‌రెడ్డి, డాక్టర్ జగన్, డాక్టర్ రజిని, అన్నమయ్య, అనుదీప్‌లు పాల్గొన్నారు.

## ముషీరాబాద్ సర్కిల్-9 డిఎంసిగా రామానుజుల రెడ్డి బాధ్యతల స్వీకరణ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్9 డిప్యూటీ కమీషనర్‌గా పి.రామానుజుల రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పి.రామానుజుల రెడ్డి శనివారం అబిడ్స్ లోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇంచార్జి డిప్యూటీ కమిషనర్‌గా అంబర్ పేట్ డిఎంసి మారుతీ దివాకర్ రావు వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. శనివారం అయన నుండి బాధ్యతలను స్వీకరించిన పిరామానుజుల రెడ్డి గతంలో కోదాడ, షాద్ నగర్, బడంగ్ పేట్ , సిరిసిల్ల, కామారెడ్డి, సూర్యాపేట అనంతరం భువనగిరి పురపాలక సంఘం కార్యాలయంలో కమీషనర్‌గా బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రభాత వార్త'తో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. పరిపాలనా , పౌర సవాళ్లను పరిష్కరించడానికి చురుకైన విధానాన్ని సూచిస్తూ, ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వడం, పాలనను క్రమబద్ధీకరించడం , అభివృద్ధి పనులను వేగవంతం చేయడం వంటి వాటిపై దృష్టిని సారిస్తానని తెలిపారు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ప్రభుత్వ పథకాల అమలు చేయడం, "ప్రజా సమస్యలను ప్రాధాన్య అంశంగా , సమర్ధవంతమైన పరిష్కారాలను అందించడానికి , ప్రస్తుతం వివిధ విభాగాల్లో ఉన్న అధికారుల సమన్వయంతో పని చేసేలా చూడటంపై నా ప్రాథమిక దృష్టి ఉంటుంది" అని అన్నారు. అదే విధంగా "ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి ప్రతి ఒక్కరితో సన్నిహిత సమన్వయంతో పనిచేయడం, పారిశుద్ధ్య పనుల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించడమే కాకుండా వ్యక్తిగతంగా సమీక్షించాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పకుండ పాటించడంతో పటు టాక్స్ కలెక్షన్ లను వాసులు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అనంతరం వివిధ విభాగాల అధికారులతో, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## కార్పొరేటర్ జోక్యంతో సివిల్ సప్లయ్ ఖాళీ స్థలానికి మోక్షం



సివిల్ సప్లయ్ ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయకుమార్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** 10 ఏళ్లుగా డంపింగ్ యార్డ్ ను తలపించే విధంగా మారిన సివిల్ సప్లయ్ ఖాళీ స్థలానికి గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ చొరవతో మోక్షం లభించింది. గాంధీనగర్ డివిజన్ ఎస్ఆర్‌టిలో నూతనంగా నిర్మించిన అమ్మ వారి కమాన్ ప్రక్కన ఉన్న సివిల్ సప్లయ్ కి సంబంధించిన ప్రభుత్వ ఖాళీ స్థలంలో గత 10 ఏళ్ల గా మట్టి ,చెత్త చెదారం తో నిడిపోయి దుర్వాసన, దోమలు వృద్ధి చెంది స్థానికులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని ఎస్ఆర్‌టి వాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి శనివారం ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త,చెదారం, మట్టినీ జిహెచ్ఎంసి, రాంకీ సిబ్బంది ద్వారా చెత్తను తొలగించే పనులను ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ పావనీ వినయకుమార్ మాట్లాడుతూ ప్రజలకు హాని కలిగించే విధంగా మారిన ఖాళీ స్థలంలోని చెత్త చెదారం తొలగించి, నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని అభివృద్ధి పరిచి, ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగకరంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.10 ఏళ్ల సమస్యకు ప్రత్యేక దృష్టినిసారించి, నిరుపయోగంగా, చెత్త చెదారం తో నిండిన స్థలాన్ని అభివృద్ధి పరిచేందుకు మోక్షం లభించిందని స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు ఎం.ఉమేష్, జి.శ్రీనివాస్, సాయి కుమార్, ఆనంద్ రావు, జిహెచ్ఎంసి, రాంకీ సిబ్బంది రాజ్ కుమార్, రాంకీ, మాధవి, రామ కృష్ణ స్థానికులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతలు కెటిఆర్,కవితలను కలిసిన రవీందర్‌యాదవ్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన రవీందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలను శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రవీందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. శనివారం తిరుమల శ్రీవారి ప్రసాదాలను కేటీఆర్,కవితలకు అందజేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని తాజా రాజకియ పరిణామాలు, పరిస్థితులపై రవీందర్ యాదవ్‌ను అడిగితెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో రవీందర్‌యాదవ్‌కు సముచిత స్థానం దక్కుతుందన్న హామీని ఇచ్చారని ఆయన వెల్లడించారు. తిరుమల శ్రీవారిని బీఆర్ఎస్ విజయవం సాధించేలా,మళ్లీ కేసీఆర్ ముఖ్య మంత్రి అయ్యేలా చూడాలని కోరుకున్నట్లు రవీందర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకున్న ప్రజా సమస్యలపై పోరాడాలని కేటీఆర్ సూచించినట్లు రవీందర్ తెలిపారు. ఉద్యమకారులకు,యువతకు కేసీఆర్ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లుగా గుర్తుచేసినట్లు వెల్లడించారు. శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే నియోజక వర్గంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు. శేరిలింగంపల్లిలో గులాబీ జెండా విజయకేతం ఎగరేయబోతుందని వెల్లడించారు. ఎంతమంది నేతలు పార్టీలు మారినా ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు నమ్మకాన్ని,విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని, కేటీఆర్, కవితల నాయకత్వంలో హైదరాబాద్ విశ్వనగరాల సరసన,తెలంగాణను దేశంలోనే ప్రథమస్థానంలో నిలుపుతారని రవీందర్‌యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## వైభవంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరు కళ్యాణోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఏసిపి రుద్ర భాస్కర్ దంపతులు

**చార్మినార్,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్టలో ఉన్న చారిత్రక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో స్వామి వారి తిరు కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.దేవాలయంలో హోమం,మహాపూర్ణహుతి జరిగాయి.అమ్మవార్ల తిరు కళ్యాణోత్సవం అర్చకులు కంజర్ల ప్రతాపా చార్యులు,కంజర్ల ప్రణయ్ కుమార్ చార్యుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిగింది. రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, ఇంటిలిజెన్స్ ఏసిపి రుద్ర భాస్కర్ దంపతులు టిపిసిసి ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ముదిరాజ్,చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బోయ నరేష్,ఆలయం కమిటి చైర్మన్ మహేష్ గౌడ్‌తో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో శ్రీ గుజరాతి పోచమ్మ దేవాలయానికి భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** గుడిమల్కాపూర్ డివిజన్ శ్రీ గుజరాతి పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణ భూమి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. శ్రీ పుల్లేటి కుర్తి గణపతి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో వీరబోయిన కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు పవన్ కుమార్, విజేందర్ కుమార్, నిత్యానంద కుమార్, నాగేందర్, అశోక్ కుమార్, ఉమా మహేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my client Mr. Dharavath Appanaik S/o. Mr. Dharavath Balu, Age34, Occ: Private Employee,R/o. H. No. 5-9-231/226/1, Employee Colony, Near Leela Lather, Yapral, Hyderabad-500087, is the owner of All that the Residential House No. 1-3-20/15&16 (PTI No. 1010129613) on Plot bearing No. 15 and 16, in Survey Nos. 66 admeasuring area 160 Sq. Yards or 133.76 Sq. Meters, having plinth area 300 Sq. Ft., with A.C.C. Sheets, situated at Block No. 3, Padmarao Nagar, Vampuguda, Kapra, under GHMC Kapra Circle and Mandal, Medchal - Malkajgiri District acquired under a Registered Sale deed bearing Doc. No. 511/2025 registered at SRO Kapra, my clienthas lost his one of original link sale deed doc. No. 4796/2000registered at SRO Malkajgiri dated 28.08.2000 executed by Mrs. M. Shanta W/o. Mr. M. Jaya Prakash in favor of Mrs. G. Rajeshwari Bhaskar S/o. Mr. G. Bhaskar

Therefore my client through this notice inform the general public at large that the document shall not be used/Misused my purpose by anybody and it anybody doing so, the same will be at this own risk and if anybody is having any claim on the property mayapproachtheundersign-within(7)daysfromthepublication.

**V MAHENDER REDDY**
ADVOCATE
R/o: Plot No. B-57, Phase-II, Allwyn Colony, Kukatpally Hyderabad-500072
**PH : 9440538936**

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన

నిట్ నెం.41/EE-DIV-29/SBZ/GHMC/2024-25 తేది: 21.02.2025
పనిపేరు : 6 పనులు - 2025 సంవత్సరానికి GHMC, SBZ, సికింద్రాబాద్, డివిజన్-29 యొక్క అన్ని వార్డులలో మాన్యువల్ మరియు యాంత్రిక పద్ధతులచే వర్షపు నీటి కాలువల డ్రైన్స్ యొక్క పూడిక తొలగింపు. అంచనా మొత్తం/ECV లక్షలలో: 84.70. బిడ్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 24.02.2025 సా.4.00గం. నుండి 04.03.2025 సా.4.00గం.వరకు. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, GHMC, సికింద్రాబాద్, సెల్ నం: 7569280018. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, GHMC.
DIPR.NO.10562-PP/CL/ADVT/1/2024-25 తేది: 22.02.2025

